సాక్షి
నిజామాబాద్

శనివారం । 23 । ఆగస్టు । 2025



గ్రామాల అభివృద్ధే లక్ష్యం
గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.
- 8లో ▸



నిండుకుండలా ఎస్సారెస్పీ
ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరుతో శ్రీరాంసాగర్ జలాశయం నిండుకుండలా మారింది.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.5 /21.7

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో యూరియా కొరత లేదు

- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్



నిజామాబాద్ రూరల్: జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ పేర్కొన్నారు. నగర శివారులోని ఖానాపూర్ వద్ద గోదాంలలో నిల్వ ఉంచిన యూరియాను శుక్రవారం ఆయన జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గడుగు గంగాధర్ మాట్లాడుతూ జిల్లాకు ఇప్పటికే 6,700 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, ఇంకా 4 వేల టన్నులు రావాల్సి ఉందన్నారు. మరో 4 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని తెలిపారు. ప్రతిపక్షాలు యూరియాపై అనవసరంగా రాజకీయం చేస్తున్నాయన్నారు. రైతుల పక్షాన ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపైన బురదజల్లే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మొద్దని కోరారు.

త్వరలో చేపపిల్లలను పంపిణీ చేస్తాం



బాల్కొండ: మత్స్య సహకార సంఘాలకు త్వరలో చేపపిల్లలను పంపిణీ చేస్తామని మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులు పేర్కొన్నారు. శ్రీరాంసాగర్ జలాశయం వద్ద ఉన్న చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఎఫ్‌డీవో దామోదర్‌తో కలిసి పరిశీలించారు. ప్రస్తుత సీజన్‌లో 54 లక్షల చేప పిల్లల ఉత్పత్తి లక్ష్యం కాగా, 40 లక్షల చేపపిల్లలు మాత్రమే ఉత్పత్తి అయినట్లు వెల్లడించారు. చేపపిల్లలను అంగుళం సైజు వరకు పెంచుతున్నామని తెలిపారు. ప్రస్తుత సంవత్సరం చేపపిల్లల ఉత్పత్తి సీజన్ ముగిసిందన్నారు. వచ్చే సంవత్సరం ప్రభుత్వం సకాలంలో నిధులను విడుదల చేస్తే ఎక్కువ మొత్తంలో చేపపిల్లలను ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేస్తామన్నారు. మత్స్య సహకార సంఘాలు అధికారులకు సహకరించాలన్నారు.

అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



మిట్టపల్లి రిత్విక

నవీపేట: స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28 నుంచి గుజరాత్‌లో నిర్వహించే 11వ ఏషియన్ అక్విటిక్ చాంపియన్‌షిప్ 2025 పోటీలకు మండలంలోని బినోల గ్రామానికి చెందిన మిట్టపల్లి రిత్విక భారత దేశం తరఫున ఎంపికైంది. స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీ మోనాల్‌చొక్ శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించినట్లు ఆమె తండ్రి ప్రకాష్‌రావ్ తెలిపారు. భారతదేశం తరఫున రిత్విక ఎంపికవడంతో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త, స్విమ్మింగ్ ఫెడరేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉమేష్, మైపాల్‌రెడ్డి అభినందించినట్లు ఆయన పేర్కొన్నారు.

కాడెద్దుల సంబురం

- ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య



వర్ని మండలం ఘన్‌పూర్ గ్రామంలో హనుమాన్ ఆలయం చుట్టూ ఎడ్లను తిప్పుతున్న రైతు

జిల్లా వ్యాప్తంగా రైతన్నలు శుక్రవారం పొలాల అమావాస్యను ఘనంగా జరుపుకొన్నారు. పండుగను పురస్కరించుకొని ఎడ్ల కొమ్ములకు రంగులు వేసి, మెడలో గంటలు, కాళ్లకు గజ్జెలు కట్టి అందంగా ముస్తాబు చేశారు. గ్రామాల్లోని ఆలయాల చుట్టూ బసవన్నలతో ప్రదక్షిణలు చేయించారు. ఎడ్లకు పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. పలు గ్రామాల్లో ఎడ్లతో శోభాయాత్ర నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను తిలకించారు.



నవీపేట మండలం నాళేశ్వర్ గ్రామంలో ఎడ్లతో శోభాయాత్ర

విద్యాశాఖలో
ఏసీబీ గుబులు

నిధుల పక్కదారిపై విచారణ

- టీచర్ల శిక్షణలో రూ.48 లక్షల నిధులు మాయం
- రూ.75 ప్లేట్ భోజనం ఖర్చును రూ. 165గా నమోదు చేసిన వైనం
- టెండర్లు లేకుండానే నోట్ బుక్కులు, టీఎల్‌ఎం మేళా పరికరాల పంపిణీ



నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖ అధికారుల్లో ఏసీబీ గుబులు మొదలైంది. పరిపాలనా వ్యవహారాల్లో అక్రమాలు జరిగినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. నిధుల దారి మళ్లింపు, తప్పుడు బిల్లులతో లక్షల్లో నొక్కేసినట్లు తెలుస్తోంది. విద్యాశాఖలో జరుగుతున్న అవినీతిపై ఇటీవల ఆర్మూర్‌కు చెందిన ఓ ఉపాధ్యాయుడు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ అధికారులు వారం రోజులుగా ఉద్యోగులను విచారిస్తుండడంతో అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో అక్రమాల్లో పాలుపంచుకున్న అధికారులు, ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

శిక్షణ పేరిట భక్షణ?

వేసవి సెలవుల్లో జిల్లా విద్యాశాఖ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించింది. మూడు విడతలుగా 15 రోజులపాటు కొనసాగాయి. ఇందులో 5,611 మంది టీచర్లు, 358 మంది రీసోర్స్ పర్సన్లు, 60 మంది ప్రైమరీ స్కూల్ టీచర్లు, 60 మంది క్లర్కులు, 175 మంది అటెండర్లు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణకు రూ.2 కోట్ల 75 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో సెంటర్ ఇన్‌చార్జికి రోజుకు రూ.2500 కేటాయించాలి. కానీ, కొందరికి మాత్రమే ఈ గౌరవ వేతనాన్ని అందజేశారు. మరోవైపు ప్లేట్ భోజనానికి రూ.75 ఖర్చు చేసి, నివేదికలో మాత్రం రూ.165గా నమోదు చేశారు. అంతేకాకుండా బిల్లుల కోసం హెచ్‌ఎంలు, సెంటర్ కోఆర్డినేటర్లతో బలవంతంగా సంతకాలు చేయించినట్లు తెలిసింది. అక్రమాలు తెలిసి నిలదీసిన మహిళా హెచ్‌ఎంను బెదిరించగా, మరో ఉపాధ్యాయుడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకున్నారు. సెంటర్ కోఆర్డినేటర్ల కేటాయింపుల్లోనూ నిబంధనలు తుంగలో తొక్కినట్లు తెలిసింది. వారికి అనుకూలంగా ఉండే వారిని కోఆర్డినేటర్లుగా నియమించి, బిల్లులపై తేలికగా సంతకాలు చేయించుకున్నట్లు సమాచారం. ఇలా టీచర్ల శిక్షణ కార్యక్రమాల్లోని రూ.48 లక్షలు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే ఓ అధికారి నిధులను దారి మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

భవిత కేంద్రాల్లో అక్రమ వసూళ్లు

జిల్లాలోని ఒక్కో భవిత కేంద్రంలో వివిధ ఆట వస్తువుల కొనుగోలుకు ఇటీవల రూ.2 లక్షలు కేటాయించారు. సిద్దిపేటకు చెందిన ఓ వ్యక్తికి కొనుగోలు ప్రక్రియను అప్పగించారు. ఈ వ్యవహారంలో జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్షలో పనిచేసే ఉద్యోగి ఒకరు కీలకపాత్ర పోషించి టెండర్లు లేకుండానే కాంట్రాక్ట్ ఇచ్చేలా చేశారు. కాగా, ఆ వ్యక్తి సగం వస్తువులనే కొనుగోలు చేశారు. అంతేకాకుండా ఒక్కో కేంద్రం నుంచి రూ.25 వేల చొప్పున ముందస్తుగానే తీసుకొని వస్తువులను తర్వాత పంపిణీ చేసినట్లు ఆరోపణలున్నాయి. భవిత కేంద్రం మరమ్మతు పనుల్లోనూ అదే తరహా అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. కాగా, ఆర్మూర్ నియోజకవర్గంలోని ఓ మండలంలో భవిత కేంద్రం భవన నిర్మాణ పనులు సొంత బంధువుకి అప్పగించినట్లు ఆరోపణలున్నాయి.

కేజీబీవీలలో నిధుల గల్లంతు

జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో విద్యార్థులకు నోటుబుక్కులు, టీచర్ లెర్నింగ్ మెటీరియల్ పంపిణీకి సంబంధించి ఒక్కో కేజీబీవీకి రూ.90 వేలు కేటాయించారు. టెండర్ల ద్వారా సామగ్రి పంపిణీ చేయాల్సి ఉండగా, అవేమీ లేకుండానే కామారెడ్డికి చెందిన ఒకరికి పంపిణీ బాధ్యత అప్పగించారు. ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండా లక్షలు ముట్టజెప్పారు. ఈ వ్యవహారం రాష్ట్ర అధికారులకు తెలియడంతో కేజీబీవీ ఇన్‌చార్జితోపాటు ఓ అధికారికి మెమోలు జారీ చేశారు. కానీ, సదరు కాంట్రాక్టర్ నుంచి ఉద్యోగులు కమీషన్ వసూలు చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ఇప్పటికీ విచారణ కొనసాగుతూనే ఉంది.

ఏసీబీ సుదీర్ఘ విచారణ

జిల్లా విద్యాశాఖలో జరిగిన అవినీతిపై ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ సుదీర్ఘ విచారణ చేపడుతోంది. ఉద్యోగులను ఒక్కొక్కరిగా పిలుస్తున్న ఏసీబీ అధికారులు, లిఖిత పూర్వకంగా వివరాలు సేకరిస్తున్నారు. సస్పెన్షన్‌కు గురైన టీచర్లకు మళ్లీ విధుల కేటాయింపు, టీచర్ల శిక్షణ కార్యక్రమం, కేజీబీవీ టీ ఎల్‌ఎం కొనుగోలు తదితర వాటికి కేటాయించిన నిధుల వివరాలను సేకరించారు. ఏసీబీ అధికారుల విచారణలో మరిన్ని అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

వృద్ధులకూ సంఘాలు

- క్షేత్రస్థాయిలో మహిళా సభ్యులను గుర్తిస్తున్న ఐకేపీ సిబ్బంది
- కిశోర బాలికలు, దివ్యాంగుల సంఘాలు కూడా..
- రాష్ట్రంలోనే మొదటి మహిళా వృద్ధుల సంఘం ఏర్గట్లలో ఏర్పాటు



వేల్పూర్‌లో కొత్తగా ఏర్పడిన సంఘం సభ్యులు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఇప్పటి వరకు మనం (ఎస్‌హెచ్‌జీ) స్వయం సహాయక మహిళా సంఘాలనే చూశాం.. త్వరలో వృద్ధుల సంఘాలను కూడా చూడబోతున్నాం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ ఆ దిశగా చర్యలు ప్రారంభించింది. గ్రామాల్లో 60ఏళ్లు పైబడిన వృద్ధ మహిళలను గుర్తించేపనిలో ఐకేపీ సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ నెలాఖరు నాటికి కొన్ని సంఘాలైనా ప్రారంభించాలనే లక్ష్యంతో కసరత్తు వేగవంతం చేశారు. ఇప్పటికే శిక్షణ పొందిన సిబ్బంది గత వారం రోజులుగా వృద్ధ మహిళలను గుర్తించి ఎప్పటికప్పుడు జిల్లా శాఖకు వివరాలు నివేదిస్తున్నారు. ప్రతి సంఘంలో పది మంది ఉండేలా చూస్తున్నారు. సభ్యులను గుర్తించి వారి పేర్లు నమోదు చేస్తున్నారు. సంఘానికి పేరు పెట్టి బ్యాంకు ఖాతా తీసి ఒకరిని లీడర్‌గా ఎంపిక చేస్తున్నారు. వృద్ధ మహిళల సంఘాల ద్వారా వారి అవసరాలు, సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తారు. నిరక్షరాసులకు చదువు సైతం చెప్పిస్తారు. కుటుంబసభ్యులు, సంతానం తమను పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు కూడా సంఘం ద్వారా అధికారులకు తెలియజేసే అవకాశం కలుగనున్నది. అలాగే చిన్నగా పొదుపు డబ్బులు జమ చేయించి అత్యవసర పరిస్థితిలో వారికే ఉపయోగిస్తారు. డబ్బులు చెల్లించే స్థోమత ఉన్న సంఘాలకు కొద్దిపాటి రుణం కూడా ఇవ్వనున్నారు. సభ్యులను గుర్తించి సంఘాలు చేయడంలో ఏర్గట్ల, కోటగిరి, బాల్కొండ, మాక్లూర్, రుద్రూర్, నవీపేట్, చందూర్, బోధన్, డిచ్‌పల్లి మండలాలు వేగంగా పనిచేస్తున్నాయి. ఐతే, రాష్ట్రంలోనే మొదటి వృద్ధుల సంఘం జిల్లాలోని ఏర్గట్ల మండలంలో ఏర్పాటైంది. ఆ సంఘానికి 'అమ్మ' వృద్ధుల సంఘం అని పేరు పెట్టారు.

ఆర్థిక పరమైన శిక్షణ

15–18 సంవత్సరాలు గల కిశోర బాలికలకు సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో కూడా పది మంది సభ్యులుగా ఉంటారు. సంఘాలు చేసిన తర్వాత సామాజిక రుగ్మతలపై వీరికి అవగాహన కల్పిస్తారు. బయట తిరిగే సమయంలో తీసుకునే జాగ్రత్తలు, ఆర్థికపరమైన శిక్షణలు ఇవ్వనున్నారు. శారీరక సమస్యలపై సలహాలు ఇస్తారు. అదేవిధంగా దివ్యాంగులకు సైతం సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. ఈ సంఘంలో మహిళలు, పురుషులను కలిపి సంఘాలుగా చేసుకునే అవకాశముంది. దివ్యాంగుల సంఘంలో వారి సమస్యలు, సదరంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రభుత్వ పథకాలు, పింఛన్లు తదితర వాటిపై అవగాహన కల్పిస్తారు. స్థోమత మేరకు ఐకేపీ ద్వారా రుణాలు సైతం ఇప్పిస్తారు.

త్వరలో ప్రారంభం..



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో వృద్ధ మహిళా సంఘాలను ఏర్పాటు చేసేందుకు గ్రామాల్లో సభ్యులను గుర్తిస్తున్నాం. సంఘాల పేర్లు నమోదు చేసుకొని ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసే పని జరుగుతోంది. త్వరలోనే వృద్ధ మహిళా సంఘాలను ప్రారంభిస్తాం.

– సాయాగౌడ్, డీఆర్డీవో, నిజామాబాద్

'పనుల జాతర' పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ



తాడెంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ

మోపాల్: గ్రామాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పనుల జాతర కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ సూచించారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడెం గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎల్‌పీవో శ్రీనివాస్‌తో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో ప్రగతి కోసం పనుల జాతర కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కిరణ్‌కుమార్, ఏపీవో సునీత, పంచాయతీ కార్యదర్శి మృదుల, జూనియర్ అసిస్టెంట్ భోజన్న తదితరులు పాల్గొన్నారు.

లక్కీ డ్రా పేరుతో మోసం

బోధన్‌రూరల్ : సాలూర మండల కేంద్రానికి చెందిన మంగళి విఠల్‌ను టాటా సఫారీ కారు ఆన్‌లైన్ లక్కీ డ్రాలో గెలుచుకున్నావని మెసేజీలు పంపుతూ గుర్తు తెలియని వ్యక్తి మోసం చేశాడు. బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విఠల్‌కు ఓ సైబర్ మోసగాడు ఆన్‌లైన్ లక్కీ ద్వారా రూ.12 లక్షల టాటా సఫారీ కారు గెలుచుకున్నావని వాట్సాప్ ద్వారా మేసేజీలు పంపించాడు. కారు డెలివరీ ఇవ్వాలంటే జీఎస్టీ, ఇతర చార్జీలు చెల్లించాలని లింక్‌లు పంపుతూ వారం రోజుల వ్యవధిలో రూ.1,70,650 కాజేశాడు. ఇంకా మరికొన్ని డబ్బులు పంపాలని తరచూ మేసేజ్‌లు చేస్తుండటంతో విఠల్ తన స్నేహితులకు విషయం చెప్పగా వారు గమనించి ఇదంతా మోసమని చెప్పి 1930 నంబర్‌కు కాల్ చేశారు. సైబర్ మోసగాడు వాడిన ఫోన్ నంబర్‌కు లింకుగా ఉన్న బ్యాంక్ అకౌంట్‌లో రూ.60,061 ఉండగా ఫ్రీజ్ చేయించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రాజశ్రీ

- డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: గర్భిణుల్లో రక్తహీనత తగ్గించాలని, అప్పుడే శిశు మరణాలు తగ్గుతాయని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శిశు మరణాలపై శుక్రవారం ఆమె కార్యాలయంలో జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ జిల్లాలో శిశు, చిన్నారుల మరణాలు జరగకుండా వైద్యాధికారులు, సూపర్‌వైజర్ స్టాఫ్, ఏఎస్‌ఎంలు, ఆశావర్కర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణుల పేర్లను 12 వారాలలోపు నమోదు చేసుకొని రక్తహీనత, బరువును సమీక్షిస్తూ పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యుల ద్వారా నాలుగుసార్లు పరీక్షలు చేయించడంతోపాటు టీకాలు ఇప్పించాలని తెలిపారు. ఆరు నెలల వరకు కేవలం శిశువుకు తల్లి పాలు పట్టేలా చైతన్యపర్చాలని సూచించారు. బర్త్ ప్లానింగ్‌లో భాగంగా గర్భిణులను ముందుగానే ఆస్పత్రికి తీసుకెళ్లాలని తెలిపారు. త్వరలో కలెక్టర్ అధ్యక్షతన శిశు మరణాలపై సమీక్ష ఉంటుందని, అందరూ పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. సమావేశంలో డీఐవో అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు అంజన, రమేశ్, పీవోఎంసీహెచ్ శ్వేత, పిల్లల వైద్య నిపుణులు కీర్తి, నవీన్, స్త్రీ వైద్య నిపుణులు కీర్తి, మత్తు వైద్యుడు సుజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు ఊతం

- ఎఫ్‌పీవోలుగా 12 పీఏసీఎస్‌లు ఎంపిక
- రైతుల భాగస్వామ్యంతో బలోపేతానికి కేంద్రం చర్యలు
- ఎంపికైన సొసైటీల ఖాతాల్లో రూ. 3.16 లక్షలు జమ



రెంజల్ మండలం దూపల్లి విండో కార్యాలయం

రెంజల్(బోధన్): రైతుల భాగస్వామ్యంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)ను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విండోలను స్వయం ప్రతిపత్తి సంఘాలుగా తీర్చిదిద్దేందుకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీఎస్) ద్వారా కార్యాచరణ రూపొందించింది. మూడు సంవత్సరాల పాటు మొదటి విడతలో ఎంపిక చేసిన విండోలకు ఆర్థికసాయం అందించేందుకు సన్నద్ధమైంది. అందులో భాగంగా జిల్లాలో సహకార శాఖ ఆడిట్ లెక్కల ఆధారంగా 12 సంఘాలను అధికారులు ఎంపిక చేయగా, ఆయా సంఘాల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం రూ. 3 లక్షల 18 వేలను జమచేసింది. మూడు సంవత్సరాల్లో మొత్తం రూ.18 లక్షలను అందించనుంది. మంజూరైన నిధులను కార్యాలయం అద్దె, కంప్యూటరీకరణ, ఉద్యోగుల వేతనాలు అందించేందుకు ఖర్చుచేయనున్నారు.

రూ.2 వేలతో సభ్యత్వం

జిల్లాలోని సహకార సంఘాలు ప్రస్తుతం మార్క్‌ఫెడ్, హాకా, డీసీఎంఎస్ సంస్థల ప్రోత్సాహంతో పని చేస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు, మందుల విక్రయం ద్వారా పలు సంఘాలు లాభనష్టాలను ఎదుర్కొంటున్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని ఎన్‌సీడీఎస్ మొదటి విడతలో రైతులకు అందించిన సేవలను గుర్తించి లాభాల బాటలో ఉన్న జిల్లాలోని 12 సంఘాలను ఫుడ్ ఫార్మెషన్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీవో) కింద ఎంపిక చేశారు. ఈ విండోల్లోని వంద మంది రైతులను సభ్యులుగా చేర్పించి ఒక్కొక్కరి నుంచి రూ. 2 వేలు సభ్యత్వ రుసుముగా సేకరించాలి. రైతుల నుంచి సేకరించిన మొత్తానికి అంతే సమానంగా ఎన్‌సీడీఎస్ అందిస్తోంది. రెండూ కలిపి బ్యాంకు ఖాతాలో జమచేసి రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ అనుబంధ వ్యాపారం ప్రారంభించి వచ్చిన లాభాన్ని రైతులకు అందించనున్నారు.

జిల్లాలో ఎంపిక చేసిన సహకార సంఘాలు

మండలం పేరు	సొసైటీ
కోటగిరి	కోటగిరి
మాక్లూర్	మాక్లూర్
మోస్రా	మోస్రా
ముప్కాల్	బాడ్సి
నిజామాబాద్‌రూరల్	మాధవనగర్
నిజామాబాద్ సౌత్	నిజామాబాద్
రెంజల్	దూపల్లి
రుద్రూర్	రుద్రూర్
వేల్పూర్	వేల్పూర్
ఎడపల్లి	జాన్కంపేట్
ఏర్గట్ల	తాళ్లరాంపూర్
ఇందల్వాయి	నల్లవెల్లి

సంఘాలకు తోడ్పాటు

సహకార సంఘాలకు తోడ్పాటును అందించేందుకు మొదటి విడతలో 12 విండోలను ఎంపిక చేశాం. ఎంపికైన విండోలకు ఇప్పటికే నిధులను విడుదల చేశాం. జిల్లాలో 89 సహకార సంఘాలున్నాయి. విడతల వారిగా ప్రతీ సంఘాన్ని ఎంపిక చేస్తాం. – శ్రీనివాస్, డీసీవో

రైతులపై భారం పడకుండా చూడాలి



రైతులపై భారం పడకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలి. 100 మంది రైతుల నుంచి రూ. 2వేల చొప్పున సభ్యత్వ రుసుం వసూలు చేయడం ఇబ్బందిగా ఉంటుంది. ప్రభుత్వమే సిబ్బందికి వేతనాలు చెల్లించాలి. మా సొసైటీని ఎంపిక చేసినందుకు డీసీసీబీ చైర్మన్, డీసీవోలకు కృతజ్ఞతలు. – భూంరెడ్డి, దూపల్లి విండో చైర్మన్

క్లుప్తంగా

బీజేపీకి గుడ్‌బై చెప్పిన విజయభారతి



పెర్కిట్(ఆర్మూర్): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆలూర్ మండల కేంద్రానికి చెందిన విజయ భారతి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. రెండు ప్రభుత్వాల పాలనలో తెలంగాణ ప్రజలు నిస్సహాయ స్థితిలో ఉన్నారని, వారిని ఆదుకోవడానికి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఒక్క కేసీఆర్‌తోనే తెలంగాణ ప్రజలకు న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీతో తనకెలాంటి విభేదాలు లేవన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 25న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు వెల్లడించారు.

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ తుది జట్టు ఎంపిక



నిజామాబాద్ నాగారం: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాపోటీలకు జిల్లా తుది జట్టును ఎంపిక చేశారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిజామాబాద్ డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో పురుషులకు, మోర్తాడ్ జిల్లా పరిషత్ గరల్స్ హైస్కూల్‌లో మహిళ క్రీడాకారులకు శిబిరాన్ని నిర్వహించి తుది జట్టును ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో ఆనంద్, కార్తీక్, సాయి కుమార్, సాయి శివ, వంశీ, శివ మహేష్, పండరి, వెంకటేష్, సాయినాథ్, హర్షిత్, మహిళల విభాగంలో పూజిత, స్ఫూర్తి, హర్షిత, రితిక, సన్నిధి, వైష్ణవి, నవీన, శ్రీనిధి ఎంపికయ్యారు. వీరంతా ఈనెల 23, 24 తేదీలలో ఆసిఫాబాద్ జిల్లా గోలేటిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామ్ తెలిపారు. కామారెడ్డి జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి రాజేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేష్, వ్యాయామ ఉపాధ్యాయులు హరీష్, పాల్గొన్నారు.

నిండుకుండలా శ్రీరాంసాగర్

- ప్రాజెక్టులో 80 టీఎంసీల నీటి నిల్వ
- ఎగువ ప్రాంతాల నుంచి వస్తోన్న వరద

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. గత వారం రోజుల నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు ప్రాజెక్టుకు కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్ట్ నీటితో కళకళలాడుతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటినిల్వ 80.5 టీఎంసీలు కాగా శుక్రవారం ప్రాజెక్ట్‌లో 80 టీఎంసీల వరకు నీటి నిల్వను ఉంచారు.

కొనసాగుతున్న నీటి విడుదల

ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెరగడంతో గురువారం రాత్రి నుంచి మళ్లీ వరద గేట్ల ద్వారా నీటి విడుదలను గోదావరిలోకి ప్రారంభించారు. ఉదయం నుంచి కూడ వరద నీరు వస్తుండటంతో ప్రాజెక్ట్ నుంచి 16 వరద గేట్ల ద్వారా 49 వేల 280 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటి ఆధారంగా ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి నీటి విడుదలను పెంచుతూ తగ్గిస్తున్నారు.

ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు..

ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 6500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1500 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 651 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.90(80 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.



పూర్తిస్థాయి నీటిమట్టంతో ఉన్న ఎస్సారెస్పీ

36.20 మెగావాట్ల విద్యుదుత్పత్తి..

ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా, ఎస్కేప్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ వద్ద గల జల విద్యుదుత్పత్తి కేంద్రంలో 36.20 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. నాలుగు టర్బయిన్‌ల ద్వారా 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. కానీ నీటిమట్టం నిండుగా ఉండటంతో ఎక్కువగా విద్యుదుత్పత్తి జరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 8.12 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగిందని జెన్‌కో డీఈఈ శ్రీనివాస్ తెలిపారు.

మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- పనుల జాతరలో భాగంగా పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

డిచ్‌పల్లి/నిజామాబాద్‌రూరల్: మారుమూల, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఈనేపథ్యంలోనే 'పనుల జాతర–2025' కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. రూరల్ మండలంలోని శ్రీనగర్, తిర్మన్‌పల్లి, పాల్దా గ్రామాల్లో శుక్రవారం చేపట్టిన పనుల జాతర కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి హాజరయ్యారు. వారు ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పాల్దా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు, డ్రైనేజీలు, సోక్ పిట్స్, అంగన్వాడి భవనాలు, పశువుల కొట్టాలు, కోళ్ల ఫారాలు, గొర్రెల షెడ్లు వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఒక్క రూరల్ నియోజకవర్గం పరిధిలోనే 33 అంగన్‌వాడి భవనాలను ఏకకాలంలో చేపడుతున్నట్లు వివరించారు. ప్రజలు తమ ప్రభుత్వానికి మద్దతుగా నిలువాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, తహసీల్దార్ అనిరుధ్, ఎంపీడీవో రాంనారాయణ, నాయకులు అగ్గు భోజన్న, ఒడ్డెన్న, సొసైటీ చైర్మన్ శ్రీధర్, ఆశన్న, బాగిర్తి బాగారెడ్డి పాల్గొన్నారు.



పాల్దా గ్రామంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

డిచ్‌పల్లి మండలంలో..

డిచ్‌పల్లి మండలం ముల్లంగి(బి) గ్రామంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీతో కలిసి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం కింద పెద్ద ఒడ్డెన్న అనే రైతుకు మంజూరు చేసిన పశువుల కొట్టం నిర్మాణానికి కలెక్టర్ శంకుస్థాపన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పనుల జాతరలో భాగంగా గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులను విరివిగా చేపడుతూ, గ్రామాల అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. రానున్న వారం పది రోజుల్లో జిల్లాలో అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డీఆర్డీవో సాయాగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా పంచాయతీరాజ్ అధికారి శంకర్, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఏపీవో మంజుల, సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ గ్యానాజి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సీపీ సాయి చైతన్య పోలీసులకు సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి నీటిని వదులుతుండటంతో గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోదావరి వైపు వెళ్లవద్దని సూచించారు. పోలీస్‌లతో పర్యాటకులు సహకరించాలని కోరారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, మెండోరా ఎస్సై జాదవ్ సుహాసిని, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వరద కాలువ హెడ్‌రెగ్యులేటర్ పరిశీలన



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గల వరద కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను మధ్య మానేరు డ్యాం ఎస్ఈ సుమతి శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా మధ్యమానేరు డ్యాంను నింపుట కోసం నీటి విడుదల కొనసాగుతుంది. దీంతో ఆమె వరద కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ను పరిశీలించుటకు వచ్చారు. వరద కాలువ నీటి లెక్కలను డిప్యూటీ ఈఈ గణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. నీరు గమ్యం చేరే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

బాల్కొండలో 'ఏసీబీ' భయం!

- ఇటీవల ఆర్మూర్ ఎంవీఐ ఏసీబీకి చిక్కడంతో మండల అధికారుల్లో గుబులు

బాల్కొండ: మండల అధికారుల్లో ఏసీబీ భయం పట్టుకుంది. వారం రోజుల క్రితం మండల కేంద్రంలో ఓ అధికారి ఏసీబీ వలకు చిక్కకుండ తప్పించుకున్నాడంటు జోరుగా ప్రచారం జరిగింది. ఈక్రమంలో గురువారం ఆర్మూర్‌లో ఎంవీఐ ఏసీబీకి చిక్కడంతో బాల్కొండలో మరింత భయం పట్టుకుంది. మండల కేంద్రంలో ఓ ముఖ్య అధికారికి ధనదాహం ఎక్కువ కావడంతో ప్రజలు తీవ్ర వేదనకు గురవుతున్నారు. సదరు అధికారి నిత్యం రూ.50వేలు వసూలు చేయాకుండ ఉండడని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో మండలంలో ఓ గ్రామానికి చెందిన రైతు అతడిని ఏసీబీకి పట్టించాలని నిర్ణయించుకున్నాడు.

కాని సదరు అధికారి చిక్కలేదని ప్రచారం జరిగింది. ఆర్మూర్ ఘటనతో ఆ అధికారికి భయం పట్టుకున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. సదరు అధికారి గతంలో బదిలీ అయినా రాజకీయ అండతో మళ్లీ బాల్కొండలోనే మకాం వేశాడు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి సదరు అధికారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పీఎస్‌వోల శిక్షణ ప్రారంభం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ల (పీఎస్‌వో)ల శిక్షణ కార్యక్రమం పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీ సాయి చైతన్య హాజరై, మాట్లాడారు. వీఐపీల భద్రత నేపథ్యంలో సేవలు అందించే పీఎస్‌వోల పాత్ర అత్యంత ముఖ్యమైనదన్నారు. నైపుణ్యాలను మెరుగుపరచడానికి, అత్యాధునిక విధానాలపై అవగాహన కల్పించడానికి, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టత ఇవ్వడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రెండు రోజుల ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు డీసీపీ ఏఆర్ రామచంద్రరావు, రిజర్వ్ సీఐ శ్రీనివాస్, తిరుపతి, సతీష్, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలకు 184 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ, బీఈడీ, బీపీఎడ్ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం జరిగిన పీజీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో మొత్తం 2,304 మంది విద్యార్థులకు గానూ 2,170 మంది హాజరు కాగా 134 మంది గైర్హాజరైనట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన బీఈడీ, బీపీఎడ్ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో మొత్తం 1,106 మంది విద్యార్థులకు గానూ 1,056 మంది హాజరు కాగా 50 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాల తనిఖీ

నిజామాబాద్ నాగారం: నగరంలోని చంద్రశేఖర్ కాలనీ, గౌతంనగర్, దుబ్బాలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో బీ రాజశ్రీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా ఐఎల్ఆర్, డీప్ ఫ్రీజర్ లో ఉంచిన వ్యాక్సిన్లు, ఐపీ, ఓపీ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం పరిధి లో డెంగీ కేసుల నమోదు, నివారణకు చేప ట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. వా రానికి రెండుసార్లు డ్రైడే నిర్వహించాలని ఆ శావర్కర్లు, ఏఎన్ఎంలు, పర్యవేక్షక సిబ్బందికి సూచించారు. సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట డాక్టర్లు శిఖర, సూసేన, మైత్రి, చంద్రకళ తదితరులు ఉన్నారు.



ఇద్దరు ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు ఏఎస్సైలు ఎస్సైలుగా పదోన్నతి పొందినట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమోషన్ పొందిన ఎస్సైలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై పనిచేస్తూ ఎస్సైగా పదోన్నతి పొందిన గంగాధర్‌ను జగిత్యాలకు, ఐదో టౌన్‌లో పనిచేస్తున్న రమేశ్‌ను ఎస్సైగా నిర్మల్‌కు బదిలీ చేశారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ ముగ్గురు పట్టుబడ్డారు. వారిని మండల పరిధిలోని పెద్ద గుజ్జుల్ తండాకు చెందిన కాట్రోత్ రమేష్, పేట్‌సంగెం గ్రామానికి చెందిన కుమ్మరి సాయిలు, కాటెవాడి తండాకు చెందిన బానోత్ గణేష్‌గా గుర్తించి కేసు నమోదు చేశారు. అనంతరం శుక్రవారం ముగ్గురిని ఎల్లారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి వారికి రూ. 1100 చొప్పున జరిమానా, ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

నాగిరెడ్డిపేట మండలంలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనం నడుపుతూ ఒకరు పట్టుబడ్డారు. మండలంలోని వాడి గ్రామానికి చెందిన పుల్కంపేట అంజయ్య మద్యం తాగి వాహనం నడుపుతుండగా పట్టుకున్నట్లు నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. కేసు నమోదు చేసి, అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి శివారులో పేకాట స్థావరంపై శుక్రవారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఈ దాడిలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 8830 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రుద్రూర్‌లో బాలుడి అదృశ్యం

రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన జ్యోతే కేదార్ (14) అనే బాలుడు అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కేదార్ గురువారం స్కూల్‌కు వెళ్లకుండా బోధన్ పట్టణానికి వెళ్లి రావడంతో తల్లిదండ్రులు మందలించారు. రాత్రి నిద్రపోయిన తర్వాత కేదార్ ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో బాలుడి తల్లి జ్యోతే ఆశ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

జంగంపల్లిలో ఒకరి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ (32) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో శుక్రవారం వేకువజామున అతడు బయటకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి, బైక్‌పై బయలుదేరాడు. జంగంపల్లి చెరువు సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ప్రత్యూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

బస్టాండ్ క్యాంటీన్‌లో కూలిన పైకప్పు



బాన్సువాడ: బాన్సువాడ బస్టాండ్‌లో ఉన్న క్యాంటీన్ పైకప్పు శుక్రవారం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో క్యాంటీన్‌లో ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బస్టాండ్ పురాతన భవనం కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పైకప్పు తడిసిపోయి కూలింది. పైకప్పు కూలిన శబ్దానికి ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. క్యాంటీన్‌లో ఉన్న సామగ్రి పూర్తిగా దెబ్బతింది. ఆర్టీసీ అధికారులు శిథిలావస్థకు చేరిన బస్టాండ్‌కు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పాఠశాలకు నోటీసులు జారీ

పెర్కిట్(ఆర్మూర్): పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలకు ఎంఈవో రాజ గంగారాం శుక్రవారం నోటీసులు జారీ చేశారు. టీసీల కోసం వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తుండటంతో నోటీసులు ఇచ్చినట్లు ఎంఈవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజుల విషయంలో గాని టీసీల విషయలో విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తే పాఠశాల యాజమాన్యాలపై శాఖపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఒకరిపై కోతులు దాడి చేసి గాయపర్చాయి. గ్రామానికి చెందిన సింగిల్ విండో వైస్ చైర్మన్ గంగాగౌడ్ శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లివస్తుండగా వస్తుండగా పాఠశాల సమీపంలో కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. వెంటనే పిట్లం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి భూపల్లి ప్రదీప్, స్థానిక ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ వైద్యుడు సాయిబాబా, ఏఎన్ఎం లక్ష్మి, ఆయనకు ఆరోగ్య సలహాలు అందించారు. కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్ తదితరులు ఆయనను పరామర్శించారు.

మూడేళ్లకు దొరికిన బైక్



పెద్దకొడప్‌గల్(జుక్కల్): హైదరాబాద్‌లో 2022లో పోయిన బైక్, మూడేళ్ల తర్వాత మండలంలో దొరికింది. ఎస్సై అరుణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం పోలీసులు ఓ బైక్‌పై నాన్ కాంటాక్ట్ చలాన్ వేశారు. దీంతో ఆ బైక్‌పై కేసు ఉన్నట్లు తెలిసింది. వెంటనే పోలీస్ సిబ్బంది ఆ బైక్ కోసం గాలింపుచేపట్టారు. మండలంలోని విఠల్‌వాడి శివారులో బైక్ పార్కింగ్ చేసిఉండగా, పోలీసులు స్వాధీనం చేసుకొని హైదరాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు ఎస్సై అరుణ్ కుమార్‌ను అభినందించారు.

ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య



రుద్రూర్‌లో ఎద్దులను ఊరేగింపుగా తీసుకెళుతున్న రైతులు



నందిపేట మండలం తల్వేద గ్రామంలో..



సాలూరలో..



నాళేశ్వర్ గ్రామంలో..

నందిపేట్/రుద్రూర్/నవీపేట/బోధన్/వర్ని: బోధన్, ఆర్మూర్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎడ్ల పొలాల అమావాస్య పండుగను రైతులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు బసవన్నలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఇంట్లో చేసిన వంటకాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఎడ్లు లేనివారు మట్టితో ఎడ్ల ప్రతిమలను తయారు చేసి పూజలు చేశారు. సాయంత్రం వేళ ఎడ్లతో ఊరేగింపు నిర్వహించి, ఆలయాల చుట్టూ ఎడ్లతో ప్రదక్షిణలు చేయించారు. పంటలు సమృద్ధిగా పండాలని అన్నదాతలు మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు రైతులను ఘనంగా సన్మానించారు. రైతులతోపాటు గ్రామ అభివృద్ధి కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పాత వాహనాలకు హెచ్ఎస్ఆర్పీ తప్పనిసరి

- నంబర్ ప్లేట్లను మార్చుకునేందుకు సెప్టెంబర్ 30 వరకు గడువు

ఖలీల్‌వాడి: వాహనాలకు హెచ్ఎస్ఆర్పీ (హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్) తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. పాతది, కొత్తది అనే తేడా లేకుండా వినియోగించే వాహనమేదైనా విధిగా హై సెక్యూరిటీ నంబరు ప్లేటు కలిగి ఉండాల్సిందే. 1 ఏప్రిల్ 2019 తర్వాత రిజిస్టర్ అయిన వాహనాలన్నింటికీ హెచ్ఎస్ఆర్పీ (హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్) బిగిస్తున్నారు. దీనికన్న ముందు ఉన్న రిజిస్టర్ చేసుకున్న వాహనాలకే కేంద్రం తాజా నిబంధన విధించింది. ఇందుకోసం పాత వాహనాల నంబర్ ప్లేట్లను మార్చుకునేందుకు సెప్టెంబర్ 30 వరకు గడువు విధించింది.

ఆన్‌లైన్‌లో బుకింగ్..

పాత వాహనదారులు www.siam.in అనే వెబ్‌సైట్ ఆధారంతో వీటిని పొందవచ్చు. పేజీని తెరిచిన తర్వాత అందులో హెచ్ఎస్ఆర్పీ రిజిస్ట్రేషన్ ఎంచుకోవాలి. వాహన వివరాలు నమోదు చేసి బుక్ చేసుకోవాలి. వాటి ఆధారంగా తగిన రుసుము చెల్లిస్తే నంబరు ప్లేటు మనం ఎంచుకున్న చిరునామాకే వస్తుంది. దాన్ని మన వాహనానికి బిగించుకొని ఫొటోను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. అలాగే వివిధ ద్విచక్రవాహన తయారీ సంస్థలు తమ డీలర్ల వద్ద హెచ్ఎస్ఆర్పీ బిగించే సదుపాయాన్ని కల్పించాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. ఇందు కోసం వినియోగదారుల నుంచి నిర్ణీత రుసుమును వసూలు చేసేందుకు అవకాశం కల్పించారు. అయితే నంబరు ప్లేట్ల ధరలు డీలర్ల వద్ద కనిపించేలా ప్రదర్శించాలి. ఒకవేళ ఇంటికి వెళ్లి బిగించాల్సి వస్తే అదనంగా రుసుము తీసుకోవచ్చు.

హెచ్ఎస్ఆర్పీ లేకపోతే...

- వాహనం ఇతరులకు అమ్మడం సాధ్యం కాదు.
- ఆర్టీఏ పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదు చేస్తారు.
- రిజిస్ట్రేషన్ మార్పు జరగదు.
- వాహనం ప్రమాదానికి గురైనపుడు ఏ రకమైన సహాయం పొందడానికైన కష్టమవుతుంది.
- ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ తీసుకోవడానికి అవకాశం ఉండదు.

హెచ్ఎస్ఆర్పీ రుసుం వివరాలు


వాహనం రకం	చెల్లించాల్సింది(రూ.)
ద్విచక్ర వాహనం	320–380
ద్విచక్ర వాహనం (ఇంపోర్ట్)	400–500
కార్లు	590–700
కార్లు (ఇంపోర్ట్)	700–860
త్రీవీలర్ వాహనం	350–450
కమర్షియల్ వాహనం	600–800

నియామకం



నిజామాబాద్ సిటీ: జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా బైరా గణేశ్ నియమితులయ్యారు. ఈమేరకు కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా గణేశ్ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దయాకర్‌గౌడ్, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు జీవీ రామకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ డబుల్ ఇళ్లు అందించాలి



బాల్కొండ: బాల్కొండలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులందరికీ అందించాలని డిమాండ్ చేస్తు శుక్రవారం పాత జాతీయ రహదారిపై గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. మండలకేంద్రంలో 70ఇళ్లు ఇంకా పంపిణీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంపిణీ చేసిన ఇళ్లు కూడ అనర్హులకు అందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి చొరబడటానికి ప్రయత్నించారు. పోలీసులు అడ్డుచెప్పడంతో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుపై వాహనాలు గంట పాటు నిలిచిపోయాయి.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

నిజామాబాద్ అర్బన్: విద్యార్థుల హాజరు శాతం పెంచడంపై అధ్యాపకులు శ్రద్ధ వహించాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపూడి రవికుమార్ సూచించారు. నగరంలోని ప్రభుత్వ బాలుర (ఖిల్లా) జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణ, అధ్యాపకుల పనితీరును స్వయంగా పరిశీలించారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ఇకనుంచి ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశం మేరకు ఫేసియల్ బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. అధ్యాపకులు సమన్వయంతో పని చేస్తూ బోధన తీరును మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రత్యేక స్టడీ అవర్స్ కూడా ప్రతి రోజూ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అడ్మిషన్‌ల గడువు పొడిగించినందున అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు.



ఖిల్లా బాలుర కళాశాల అధ్యాపకులతో మాట్లాడుతున్న ఇంటర్ విద్య అధికారి రవికుమార్